క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కలికిరి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంగ్ల అధ్యాపక ఉద్యోగానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎంవీ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్లం బోధించేందుకు ఇంగ్లిష్ లిటరేచర్ పీజీలో 50 శాతం ఉత్తీర్ణత సాధించిన వారు ఈ నెల 28న సాయంత్రం లోపు కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని, 29న ఉదయం 10 గంటలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు డెమో ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

కలికిరి : మండల సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ గంగయ్య తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

పెద్దమండ్యం : స్థానిక పోలీస్ స్టేషన్‌ను ములకలచెరువు సీఐ పి. రాజారమేష్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. నమోదైన కేసులు, చర్యలపై ఆరా తీశారు. అలాగే స్టేషన్‌లో ఉన్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీలు పీజే ఖాన్, శ్యామ్‌ప్రకాష్, కానిస్టేబుల్‌లు పాల్గొన్నారు.

పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

నిమ్మనపల్లె : పాడి రైతులు పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి డి సాదు సురేష్ సూచించారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రమాదవశాత్తు, అనారోగ్య కారణాలతో పాడి ఆవు మృతి చెందితే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందని తెలిపారు. పాడి ఆవులను పెద్ద మొత్తంలో నగదు ఖర్చు చేసి కొనుగోలు చేస్తున్నారని, ఏ కారణం చేతనైనా పశువు మృతి చెందిన సమయంలో, బీమా చేయించకపోతే నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఒక పశువుకు రూ. 30,000 నగదు బీమాగా పొందడానికి రూ.384 నగదు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా రూ. 50 వేల రూపాయల బీమా సొమ్ము పొందడానికి రేషన్ కార్డు కలిగిన కుటుంబాలు ప్రీమియం సొమ్ము రూ. 1,664 నగదు, రేషన్ కార్డు లేని పాడి రైతులు రూ.2,240 నగదు చెల్లించాలని పేర్కొన్నారు.

ప్రయాణికుల మన్ననలు పొందాలి

మదనపల్లె సిటీ: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించి మన్ననలు పొందాలని ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం స్థానిక డిపో కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా తంబళ్లపల్లె రూట్‌లో కండక్టర్లు, డ్రైవర్లు ప్రయాణికులతో మంచి సంబంధాలు పెంచుకోవాలని, ఆదాయం పెంచాలని సూచించారు.

ఓటరు జాబితా పరిశీలన పక్కాగా చేయాలి



కురబలకోటలో మాట్లాడుతున్న ఈఆర్‌ఓ

కురబలకోట : ఓటరు జాబితా పరిశీలన పక్కాగా నిర్వహించాలని నియోజక వర్గ ఈఆర్‌ఓ రాఘవేంద్ర సూచించారు. గురువారం స్థానిక తహసీల్దారు తపస్వీ ఆధ్వర్యంలో జరిగిన బీఎల్‌ఓల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో పేర్లు తప్పులు, పోటోలు మార్పు లాంటివాటిని గమనించి సరిచేయాలని సూచించారు. బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలు సక్రమంగా ఉన్నాయా.. లేదా అని చూడడంతో పాటు చనిపోయిన వారిని జాబితా నుంచి తొలగించాలన్నారు. అలాగే వలస వెళ్లిన వారిని గుర్తించాలని పేర్కొన్నారు. కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసేవారి వివరాలను పరిశీలించాలని చెప్పారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి



మాట్లాడుతున్న ఈఓ గురుమోహన్

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఈఓ వై. గురుమోహన్ అన్నారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వాటర్‌మెన్లు, పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్యపై పలువురి నుంచి ఫిర్యాదు వస్తున్నాయని పేర్కొన్నారు. నాలుగు రోజులకోసారి తాగునీరు అందించాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు సకాలంలో సేవలందించి వారి మన్ననలు పొందాలన్నారని సూచించారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇ-క్రాప్.. రైతు సేఫ్

ఇ- క్రాప్‌తో రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. ప్రకృతి వైపరిత్యాల వలన పంట నష్టం జరిగితే ఉచిత పంటల బీమా వర్తిస్తుంది. ఇన్‌పుట్ సబ్సిడి వస్తుంది. వడ్డీ రాయితీ, రైతు భరోసా, పీఎం కిసాన్ వంటి పథకాలు వర్తిస్తాయి. ఈ పథకాలకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసే సొమ్ము ఇ- క్రాప్ నమోదు చేసుకున్న రైతుల బ్యాంక్ ఖాతాల్లోనే నేరుగా జమ అవుతాయి. ఇ-క్రాప్ ద్వారా కౌలు రైతులు కూడా పంట నష్టపరిహారం పొందవచ్చు. పంట దిగుబడులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించవచ్చు.

- ఖరీఫ్‌లో ఈ పంట నమోదు
- పంటల నమోదుతో రైతుకు ఎంతో లాభం
- పంటనష్టపోతే పరిహారం అందే అవకాశం
- కౌలు రైతులకు పరిహారం వర్తింపు



ఇ-క్రాప్ నమోదు చేస్తున్న అధికారులు

నియోజకవర్గ సాగు చేసిన పంట వివరాలు

మండలం పేరు	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	ఇ-క్రాప్ నమోదు చేసిన విస్తీర్ణం (ఎకరాల్లో)
గుర్రంకొండ	6,938	4,851
పీలేరు	13,584	9,506
వాల్మీకీపురం	9,254	6,457
కలికిరి	10,120	7,084
కేవీపల్లె	10,650	4,260
కలకడ	5,486	3,843
మొత్తం	56,032	36,ద001

గుర్రంకొండ : ప్రకృతి వైపరీత్యాల కారణంగా తీవ్ర నష్టాలను చవిచూస్తున్న రైతులకు ఇ-క్రాప్ నమోదుతో ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. పంటలు నష్టపోతున్న రైతులకు ఇ- క్రాప్ వరంగా మారుతోంది. ప్రస్తుతం ఉద్యానవనశాఖ, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా ఇ -క్రాప్ నమోదు ప్రక్రియ చేపట్టారు. సాగులో అన్ని రకాల పంటల వివరాలను నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ఈ ప్రక్రియ పదిహేను రోజులుగా ముమ్మరంగా సాగుతోంది. పంటల సాగు వివరాలు నమోదు చేయడం ద్వారా ప్రకృతి వైపరీత్యాలతో రైతులు తాము పండించిన పంటలు నష్టపోతే ప్రభుత్వం సాయం అందించేందుకు వీలుంటుంది. సాధారణ రైతులతో పాటు కౌలురైతులకు పంట నష్టపరిహారం దక్కడం గమనార్హం.

ఇ-క్రాప్‌తో ప్రయోజనాలు

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు నేరుగా నష్టపరిహారం పొందే వెసులుబాటు ఉంటుంది. దళారుల చేతికి బీమా పరిహారం అందదు. ప్రభుత్వమే పూర్తిస్థాయిలో రైతుల తరఫున బీమా సొమ్ము చెల్లిస్తుంది. దీంతో పంట నష్టపోయినప్పుడు గతంలో ఇ- క్రాప్ ద్వారా నష్టపోయిన రైతు ఎంత మేరకు పంట సాగు చేశాడో వివరాలు తెలుస్తాయి. అలాగే పంట మార్పిడికి వీలుంటుంది. పంటల వివరాల ఆధారంగా ఉత్పత్తుల లభ్యతపై స్పష్టత వచ్చే అవకాశముంటుంది. పైగా దిగుబడుల అంచనాకు ఇది సరైన విధానం. ఎరువులు, పురుగుల మందులు, ఎంత మేరకు అవసరం అవుతాయో ఆయా పరిధిలోని ఆర్‌బీకేలకు తెలిసే అవకాశముంది.

బ్యాంకుల్లో పంట రుణాలు

ఇ- క్రాప్ నమోదు ప్రక్రియ ముగిసిన అనంతరం వ్యవసాయాధికారులు జారీ చేసి ఇ- క్రాప్ సర్టిఫికెట్ ద్వారా రైతులు బ్యాంకులో పంట రుణాలు పొందే అవకాశముంది. ఇప్పటివరకు పంట రుణాలు పొందని రైతులు వ్యవసాయాధికారులు జారీ చేసే సర్టిఫికెట్లతో బ్యాంకుల్లో పూర్తిస్థాయిలో రుణాలు పొందవచ్చు. గతంలో పంట రుణాలు పొందిన రైతులు ఇ- క్రాప్ నమోదు సర్టిఫికెట్లను ఆధారంగా చేసుకొని పంట రుణాలు రెన్యువల్ చెసుకోవడానికి రైతులు సౌకర్యం ఉంది.

కౌలు రైతులకు పరిహారం

సాధారణ రైతులతో పాటు కౌలు రైతులకు పంట నష్టపరిహారం అందిస్తుండడం గమనార్హం. గతంలో పొలాన్ని కౌలు రైతులు కౌలుకు తీసుకున్నా పంట నష్టపరిహారం మాత్రం యజమానులకే అందేది. ప్రస్తుతం ఒకసారి కౌలు రైతుల గుర్తింపు కార్డులు జారీ చేస్తే ఈ- క్రాప్ నమోదులో సదరు పొలం కౌలు రైతులకు ఇచ్చినట్లు చూపిస్తోంది. దీంతో పొలం యాజమానులకు కాకుండా నిజమైన కౌలు రైతుల పేరు మీదే ఇ- క్రాప్ నమోదు చేస్తుండడం గమనార్హం. దీంతో పంట నష్ట పరిహారం కౌలు రైతులకు నేరుగా అందనుంది.

70 శాతం పూర్తి

నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో ఇ- క్రాప్ నమోదు ప్రక్రియ 70 శాతం వరకు పూర్తి అయింది. నియోజకవర్గంలో అన్ని రకాల పంటల సాగు మొత్తం విస్తీర్ణం 56,032 ఎకరాలు ఉంది. ఇందులో ఇప్పటివరకు 36,001 ఎకరాల్లో ఇ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి అయింది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు వారం రోజుల్లో మొత్తం ఇ-క్రాప్ ప్రక్రియ ముగించనున్నారు.

ఎంతో మేలు



ఇ- క్రాప్ నమోదుతో మాకు ఎంతో మేలు జరుగుతోంది. ఇ- క్రాప్ నమోదు చేయడానికి ఆర్బీకే సిబ్బంది మా పొలాల వద్దకే వచ్చారు. బీమా సొమ్ము చెల్లించక పోయినా ప్రభుత్వమే రైతుల తరఫున బీమా సొమ్ము చెల్లించడం ఆనందంగా ఉంది. పంటలు నష్టపోతే ఎవరి చుట్టూ తిరగకుండా ప్రభుత్వమే తమను ఆదుకొంటోంది.
– గోపాల్, సుంకరవాండ్లపల్లె

కౌలు రైతులకు న్యాయం



గతంలో ఎన్నడూ లేని విధంగా కౌలు రైతులకు ఇ- క్రాప్ ద్వారా న్యాయం జరిగింది. మేం సాగు చేసిన పంటను పరిశీలించి పంట నమోదు చేస్తున్నారు. తద్వారా అర్హులైన కౌలు రైతులందరికీ న్యాయం జరుగుతోంది. పంటనష్టం సంభవిస్తే నేరుగా కౌలు రైతులకే పంట నష్టపరిహారం ఇస్తున్నారు.
– నరేంద్ర, కౌలు రైతు, దౌలత్‌ఖాన్‌పల్లె

ఇ- క్రాప్‌తో రైతులకు ప్రయోజనం



ఇ- క్రాప్ నమోదు చేసుకోవడం వలన రైతులకు ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా రైతు భరోసా, పంట నష్టపరిహారం తప్పనిసరిగా రైతులకు అందుతాయి. ముఖ్యంగా కౌలు రైతులకు కుడా రైతు భరోసాతో పాటు పంట నష్టపరిహారం కూడా వస్తుంది. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– నవీన్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయాధికారి, గుర్రంకొండ.

అచ్యుతాపురం ఘటన బాధాకరం

మదనపల్లె : అనకాపల్లె జిల్లా అచ్యుతాపురం ఘటన బాధాకరమని, ఎసెన్షియా ఫార్మా ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ గురువారం పత్రికా ప్రకటనలో డిమాండ్ చేశారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు ఒకొక్కరికి కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాలను యాజమాన్యాలు గాలికి వదిలేస్తున్నాయని, భద్రతాప్రమాణాలు పాటించడంలో ఫార్మా కంపెనీలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. నెలరోజుల్లోనే మూడు ప్రమాదాలు జరిగినప్పటికీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్స్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కంపెనీ యాజమాన్యాలు భద్రతాప్రమాణాలు పాటించేటట్లు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

అభివృద్ధికి ఎంపీడీఓ సహకరించడం లేదు

కేవీపల్లె : జిల్లా పరిషత్ నిధులను మండలంలో అభివృద్ధి పనులకు కేవీపల్లె ఎంపీడీఓ యాదవేంద్ర సహకరించడం లేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గర్నిమిట్ట పంచాయతీలో హౌసింగ్ కాలనీలో రూ. 4 లక్షలతో పైపులైను నిర్మాణం, రూ. 5 లక్షలతో సీసీ రోడ్డు, గర్నిమిట్టలో రూ. 5 లక్షలతో సీసీ రోడ్డు, నూతనకాల్వ పంచాయతీలో సిబ్బాలవారిపల్లెకు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు, పీఎస్‌సీ వడ్డిపల్లెకు రూ. 5 లక్షలతో సీసీ రోడ్డు, కొత్తవడ్డిపల్లెకు రూ. 5 లక్షలతో సీసీ రోడ్డు, పాపినేనిచెరువు వడ్డిపల్లెలో రూ. 4.20 లక్షలతో బోరు, పంపుసెట్ పనులు చేయడానికి ఎస్టిమేషన్ సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ పనులకు సంబంధించి ఎంపీడీఓ ఆమోదించి ప్రతిపాదించాల్సింది ఉండగా స్పందించకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఎంపీడీఓపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈవిషయంపై ఎంపీడీఓ యాదవేంద్రను వివరణ కోరగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి పరిశీలిస్తామని తెలిపారు.

పంచాయతీల అభివృద్ధికి శ్రీకారం

కలకడ : గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన కోసమే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ఆయా సచివాలయాల వద్ద నిర్వహిస్తామని చెప్పారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ మాట్లాడుతూ 2024-25సంవత్సరానికి ప్రంచాయతీల వారి వార్షిక ప్రణాళికపై సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యుత్ సర్వీసులు, నీటి వసతి, డ్రైనేజీ నిర్వహణ, లింక్‌రోడ్లు అభివృద్ధి, పంచాయతీ ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి సారించడానికే ఈ గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామసభలను విజయవంతం చేయాలని కోరారు.

నేడు ప్రత్యేక గ్రామసభలు

కలికిరి : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఆయా సర్పంచ్‌ల అధ్యక్షతన శుక్రవారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గంగయ్య తెలిపారు. ఉదయం అద్దవారిపల్లి, చీకటిపల్లి, గుండ్లూరు, గుట్టపాళెం, మహల్, పారపట్ల, పత్తేగడ, మధ్యాహ్నం నుంచి మర్రికుంటపల్లి, మేడికుర్తి, మొరంకిందపల్లి, మునెల్లపల్లి, పల్లవోలు, టి.సంగ్రావారిపల్లి గ్రామాల్లో మండల స్థాయి అధికారుల సమక్షంలో గ్రామ సభలు నిర్వహిస్తామని, ప్రజలు మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులు, ఉపాధి పనులుపై వినతులు సమర్పించవచ్చన్నారు.

నేడు ఉపాధి హామీపై గ్రామసభ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కేంద్రాల్లో శుక్రవారం ఉపాధి హామీపై గ్రామసభలు జరుగుతాయని ఎంపీడీఓ కేఎస్ బాలాజీ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఆయా గ్రామాల్లోని ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో గ్రామసభలు షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తామన్నారు. ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న పనులు, రాయితీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి 2024-2025 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోవు పనులను గ్రామ సభల్లో ప్రకటిస్తామని తెలిపారు.

శాంతి సమాజ స్థాపనే మానవత ధ్యేయం



ర్యాలీ నిర్వహిస్తున్న మానవతా సంస్థ సభ్యులు

మదనపల్లె : సమాజంలో శాంతిస్థాపనే ధ్యేయంగా మానవత సంస్థ పనిచేస్తోందని సంస్థ సభ్యులు అన్నారు. గురువారం మానవత సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మానవత యూనిట్ చైర్మన్ డాక్టర్. రాటకొండ గురుప్రసాద్, డైరెక్టర్. బి.నారాయణరెడ్డి మాట్లాడుతూ శాంతి, సామరస్యం, ప్రగతి, ఆనందం కలగలిసిన సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. మానవత యూనిట్ వైస్ ప్రెసిడెంట్ సి.ప్రభాకరరెడ్డి, రమణప్ప, హరినాథ్‌బాబు, వి.నారదరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ రామమూర్తి పాల్గొన్నారు.

శాంతి ర్యాలీ

మదనపల్లె సిటీ: మానవతా సంస్థ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని మదనపల్లె పట్టణంలో గురువారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీ వద్ద సంస్థ చైర్మన్ రాటకొండ గురుప్రసాద్ ర్యాలీని ప్రారంభించారు. గురుప్రసాద్ మాట్లాడుతూ సంస్థ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లె అధ్యక్షుడు నారాయణరెడ్డి, సభ్యులు నారదరెడ్డి, మునిగోపాలకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంప్‌ను పరిశీలించిన తహసీల్దార్



ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఖాజాబీ

మదనపల్లె : పట్టణంలోని రోజా ప్లాట్స్ సమీపంలో ఇసుక అక్రమంగా డంప్ చేశారన్న సీపీఎం నాయకుల ఫిర్యాదుపై తహసీల్దార్ ఖాజాబీ క్షేత్రస్థాయి పరిశీలించారు. గురువారం రోజాప్లాట్స్‌లోని ఇసుక డంప్ వద్దకు వెళ్లిన తహసీల్దార్.. ఇసుక ఎవరు నిల్వ చేశారు. ఎక్కడి నుంచి తీసుకువచ్చారు. అనుమతులేమైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఇసుక నిల్వ చేసిన రాటకొండ రమేష్‌నాయుడు మాట్లాడుతూ ఏడాది క్రితం ఇంటి నిర్మాణం కోసం 15 టిప్పర్ల ఇసుకను, ఇతర భవన నిర్మాణ సామగ్రిని కొనుగోలు చేసి తన స్థలంలో స్టాక్ పెట్టుకున్నట్లు తెలిపారు. అయితే భవన నిర్మాణం ఆలస్యం కావడంతో ఇసుకను వినియోగించలేకపోయామని తెలిపారు. ఇసుక కొనుగోళ్లకు సంబంధించి ఏడాదిక్రితం జేపీ సంస్థకు సంబంధించిన రశీదులను చూపించారు. తాము ఇసుక డంప్ చేశామని కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేసిన వార్తల్లో వాస్తవం లేదని తహసీల్దార్‌కు వివరించారు. దీంతో తహసీల్దార్ అతడి వద్ద నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకున్నారు.

ఉచిత ఇసుక విధానం ముసుగులో టీడీపీ కొత్త దందా



ఇసుక డంప్‌ను చూపుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

మదనపల్లె : ఉచిత ఇసుక విధానం ముసుగులో టీడీపీ కొత్త దందాకు తెరలేపిందని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ఆరోపించారు. టీడీపీ నాయకుల ఇసుక అక్రమ నిల్వలను సీపీఎం నాయకులు గుర్తించారు. గురువారం కమ్మగడ్డవీధి ఎక్స్‌టెన్షన్ ఏరియా, బసినికొండ అనుమతి లేకుండా నిల్వ చేసిన ఇసుక స్థావరాలను మీడియాకు చూపించారు. ఈ సందర్భంగా పి.శ్రీనివాసులు మాట్లాడుతూ నిమ్మనపల్లె మండలంలోని బహుదా పరీవాహక ప్రాంతాల్లో టీడీపీ నాయకులు అక్రమంగా ఇసుక తవ్వి, పట్టణం నిల్వ చేస్తూ, సామాన్యులకు అందుబాటులో లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఇసుక మాఫియాను కట్టడి చేసి ప్రజలకు మంచి చేయాలని సీపీఎం పోరాడుతుంటే అభినందించాల్సిన అధికారపార్టీ నాయకులు తమపై నిందలు మోపడం సిగ్గుచేటన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని నిలబెట్టుకుంటారో, మైనింగ్ మాఫియాకు దాసోహం అంటారో టీడీపీ శ్రేణులు ఆలోచించుకోవాలని హితవుపలికారు. ఐటీయూసీ నాయకుడు జి.కృష్ణమూర్తి మాట్లాడుతూ ఇసుక అక్రమస్థావరాలను సీపీఎం ఆధ్వర్యంలో మూడురోజులుగా బహిర్గతం చేస్తున్నా రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు పవన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులతో ప్రిన్సిపాల్ మునిస్వామినాయక్

రామసముద్రం : స్థానిక మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు 78 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎంపికై ఉత్తమ ప్రతిభ కనబరచడంతో గురువారం విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మునిస్వామినాయక్ మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థి నిజాముద్దిన్ స్వాతంత్ర్య వేడుకల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి ముఖ్యమంత్రి, డీజీపీ చేతులు మీదుగా ప్రశంసాపత్రం పొందాడని తెలిపారు. అలాగే 9 వతరగతి చదువుతున్న నాగేంద్ర బాబు, బాబాఫక్రుద్దీన్, వెన్నెల, వైష్ణవి జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచి జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా ప్రశంస పత్రాలు పొందారని చెప్పారు. వీరిని పాఠశాల చైర్మన్ బాలాజి, స్కౌట్‌మాస్టర్ నాగరాజు, గైడ్ కెప్టెన్ ఇందిరా, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించి, సన్మానించారు. ప్రతి ఒక్కరూ వీరిని ఆదర్శంగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ పిలుపునిచ్చారు.

వివాదాస్పద ప్రభుత్వ భూమి పరిశీలన



ప్రభుత్వ భూమిని అధికారులతో కలసి పరిశీలిస్తున్న తహసీల్దారు మురాషావలి

సిద్దవటం : మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలో సర్వేనెంబర్-70లో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కావడంతో గురువారం పరిశీలించామని తహసీల్దారు మురాషావలి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంతా పిచ్చమ్మ అనే మహిళకు ఇక్కడ 5 సెంట్ల స్థలం ఉన్నట్లు, ఆ స్థలంలోనే రాజమాత గుడి చిన్నది నిర్మించుకొని పూజలు చేసుకుంటున్నానని నా స్థలంలో గుడిని మర్రిపల్లె రవిశంకర్ అనే వ్యక్తి తొలగించి ఆక్రమించుకొని కాళీమాత గుడి నిర్మించారని జిల్లా కలెక్టర్‌కు ఆమె ఫిర్యాదు చేసిందన్నారు. ఫిర్యాదు మేరకు స్థలాన్ని పరిశీలించామన్నారు. వివాదాస్పద స్థలానికి సంబంధించి రెవెన్యూ అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఇరువురి అభిప్రాయాలు విచారించామని, నివేదికను ఉన్నాతాధికారులకు సమర్పిస్తామని తహసీల్దారు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఇరువురితో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విచారణ ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ నాని, సర్వేయర్ నరేష్, సర్పంచ్ ప్రతినిధి తుర్రా ప్రతాప్, నాగం నరసింహారెడ్డి పాల్గొన్నారు.

బాలవిహార్‌లో చిన్నారుల ప్రసంగం



బాలవిహార్ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న విద్యార్థులు

రాజంపేట రూరల్ : వైఎస్సార్ కడపలోని రేడియో కేంద్రంలో ఫ్యూచర్ మైండ్స్ స్కూల్ విద్యార్థులు బాలవిహార్ కార్యక్రమంలో పాల్గొని గురువారం ప్రసంగించారు. అత్తిరాల పుణ్యక్షేత్రం గురించి వివరించారు. అదే విధంగా అన్నమాచార్య కీర్తనలు, దేశభక్తి గేయాలను ఆలపించారు. పర్యావరణం పరిరక్షించేందుకు మట్టిగణపతిని పూజిద్దామని తెలియజేశారు. ముఖ్యంగా ఎల్‌కేజీ విద్యార్థి జతిన్ చేసిన ప్రతిజ్ఞ ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు సుజిత, అనుపమ, వరలక్ష్మి, శివశంకర్, గంగాధర్‌లు విద్యార్థులకు సహకారం అందించారని చెప్పారు.

వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం



రక్తహీనత, మాదక ద్రవ్యాల నిర్మూలన గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రాజశేఖర్

నందలూరు : రాజంపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అధికారి ఎస్.రాజశేఖర్ పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న విఫ్స్ కార్యక్రమాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన కౌమార బాల బాలికలకు రక్తహీనత, మాదకద్రవ్యాల నిర్మూలన, ఆత్మహత్యల నివారణ, పౌష్టికాహారం, మానసిక ఒత్తిడి, లైంగిక సుఖ, అసంక్రమిత రోగాలు గురించి అవగాహన కల్పించారు. పాటూరు వెల్నెస్ సెంటర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ షర్మిల మాట్లాడుతూ పేదరికం, నిరక్షరాస్యత, మేనరికపు సంబంధాల కారణంగా పిల్లలకు చిన్నతనంలోనే వివాహాలు చేయడం వల్ల, బాల్య వివాహాలతో నెలలు నిండకుండా బరువు తక్కువ గల శిశువులు జన్మించే అవకాశాలు అధికంగా ఉండి మాంద్యం, తెలివితేటలు తక్కువగా ఉండటం, గుండె సంబంధిత వ్యాధులు వస్తాయన్నారు. ఏఎన్ఎం సంపూర్ణ మాట్లాడుతూ కౌమార దశ అనేది చాలా విలువైనది, ఈ దశలో వ్యక్తిగత పరిశుభ్రత అనేది చాలా ముఖ్యమన్నారు. అనంతరం ఆశ కార్యకర్త శిల్ప, శ్యామలాలు కౌమార బాల బాలికలకు ఐరన్ టాబ్లెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు మాధవీలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.